# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com
www.prajaswaramdaily.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 25 | గురువారం, 10 అక్టోబర్ 2024 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool |




02

## హైడ్రా బాధితులకు మన జీతాలిద్దం

- నా పది నెలల జీతం రూ. 20 లక్షలు ఇచ్చేందుకు రెడీ
- బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సవాల్
- వేలాది మంది ఇళ్ల కోసం లోన్లు తెచ్చుకుంది నిజం కదా?
- అది ఫేక్ అయితే సూసైడ్ చేసుకుంటానని కామెంట్స్



02

## దసరాకైనా కేటీఆర్ బుద్ధి మారాలి

- అసత్య ప్రచారాలతో ప్రజల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారు
- మేము చిత్తశుద్ధితో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రజలు ఓడించాక పదేళ్ల పాలనపై చర్చ ఎందుకు?
- ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాల్సింది పోయి.. కూల్చేస్తావా అంటూ ఫైర్



02

## బీఆర్ఎస్ ఆనాడు ఏం చేసింది

- ఉద్యోగాలపై ఇప్పుడు మాట్లాడుతుంది?
- ఎమ్మెల్యేల ఫిరాయింపులపై మీరు ఏం చేశారో తెలుసు
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

## పారిశ్రామిక దిగ్గజం
# రతన్ టాటా కన్నుమూత

- ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన టాటా
- సంతాపం ప్రకటించిన ప్రధాని నరేంద్రమోడీ

02



## వారి ఉద్యోగాలు ఊడగొడ్తే.. మీకు ఉద్యోగాలొచ్చాయ్

### మేం 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలిచ్చాం

- నోటిఫికేషన్లు ఆపడానికి బిల్లా, రంగా ఆరాటపడుతున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- నాణ్యమైన విద్య అందించేందుకు టీచర్ల భర్తీ
- ప్రభుత్వ స్కూళ్లకు పంపడానికి నామోషీగా ఫీలవుతున్నారు
- ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తాం
- టీచర్లకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం కామెంట్స్
- ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు నిర్ణయం



**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**
తండ్రీ కొడుకుల ఉద్యోగాలు ఊడగొడితేనే ఉద్యోగాలు వస్తాయని ఆనాడు మాట ఇచ్చామని, నేడు అది రుజువు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ 2024 ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మిమ్మల్ని మిగతా 2లో..

## కవితను జైల్లో పెట్టినా.. భయపడకుండా
# పోరాటం చేస్తున్నాం

### నియామకాలపై కాంగ్రెస్ నీతిమాలిన ప్రచారం చేస్తోంది

- మా ఉద్యోగాలు మీ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు
- ప్రజాధనాన్ని తగలేసి పచ్చి అబద్ధాలతో ఫ్రాంట్ పేపర్‌లో యాడ్స్
- బతుకమ్మ, దసరా వేళ భయానక వాతవరణం సృష్టించారని ఫైర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో దసరా పండుగ చేసుకునే వీలు లేకుండా భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, బతుకమ్మ చీరలు వచ్చి ఉండేవన్నారు. ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకోకుండా డీజేను బంద్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన చెల్లెలు కవితను కక్షగట్టి తీహార్ జైల్లో పెట్టారని, అయినప్పటికీ తాము భయపడకుండా పోరాటం చేస్తూనే ఉంటామని చెప్పారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన మిగతా 2లో..

## మందకృష్ణ మాదిగ అరెస్ట్

- వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడాన్ని నిరసిస్తూ నిరసనలు
- ఇందిరా పార్క్ వద్దకు ర్యాలీగా వెళ్లిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు
- అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర వాగ్వాదం
- మాదిగలను ప్రభుత్వం మోసం చేస్తుంది
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




02

## పూలకే పూజ చేసే పండుగ
# మన బతుకమ్మ

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- అంబర్‌పేటలో బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు




02




## కేసీఆర్ దుర్మార్గుడు

02

- బ్రాహ్మణ వెల్లంలకు ఒక్క రూపాయి ఇవ్వలేదు
- నల్గొండ సాగునీటితో సస్యశ్యామలం చేస్తా..
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

## కాంగ్రెస్ కుట్రలన్నీ విఫలం

- విష బీజాలు నాటాలని చూసింది
- బీజేపీకి అన్ని వర్గాలు అండగా నిలిచాయి
- హర్యానా ఎన్నికలపై ప్రధాని నరేంద్ర మోడీ



02

# కేసీఆర్ దుర్మార్గుడు

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

గత సీజన్‌లో పూర్తిగా కొనుగోలు చేయడం జరిగిందని, అధికారులతో ఫాల్ అప్ చేస్తూ రైతులు అమ్ముకునే ధాన్యానికి మూడు రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నల్గొండలో ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డులకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. అదే రోజు బోనస్ అమౌంట్ మీ అకౌంట్‌లో పడుతుంది అన్నారు. సివిల్ సప్లై మీద గతంలో కొంత అపవాదు ఉంది ఇప్పుడు అలాంటి సంఘటనలు జరగొద్దని, ఇది రైతు ప్రభుత్వం చెప్పారు. రైతు పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్నారు. ఉపాధి హామీ పథకం పెట్టిన ప్రభుత్వం మాది అన్నారు. గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు రావడానికి చాలా సమయం పట్టిందని, నేడు తమ ప్రభుత్వంలో మొదటి తేదీ జీతాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే మూడు నెలల్లో నల్గొండ సాగునీటితో సస్యశ్యామలం చేసే దిశగా కాలువలు తిస్తున్నామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. కేసీఆర్ దుర్మార్గుడు మోసం చేయడం వల్ల బ్రాహ్మణ వెల్లంలకు ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. ఆ దుర్మార్గుడి పాలన అంతమైందని విమర్శించారు.



# పూలకే పూజ చేసే పండుగ మన బతుకమ్మ

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

దేవుళ్లను పూజించాలంటే పూలతో పూజ చేస్తాం, కానీ పూలకే పూజ చేసే పండుగ బతుకమ్మ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని అంబర్ పేట్ ఎంసీహెచ్ గ్రౌండ్ లో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబం ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక పూలు, ప్రకృతితో ముడిపడిన పండుగ బతుకమ్మ అన్నారు. ఆనాడు నిజాం, రజకర్లకు వ్యతిరేకంగా తమ బాధలను చెప్పుకునేందుకు బతుకమ్మ పాటలు పాడి వారి బాధలు తెలిపేవారని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ దేశంలో ఎక్కడ ఉండదన్నారు. మన తెలంగాణకు ఇది ప్రత్యేకమైన పండుగ అని తెలిపారు. అన్నీ వర్గాల ప్రజలు సంతోషంగా జరుపుకునే పండుగగా బతుకమ్మకు చరిత ఉందని చెప్పారు. సమాజంలో మంచి చెడులను చెప్పాలన్నా బతుకమ్మ పాటలు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా అమ్మరవారి ఆశీస్సులతో అందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకుంటునని అన్నారు. నవరాత్రి, బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో డబుల్ స్మాట్ మూవీ ఫేమ్ కావ్య తాపర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ మంగ్లీ పాడిన బతుకమ్మ పాటలు అహుతులను అలరించాయి.


# పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా కన్నుమూత

**ప్రజాస్వరం, నేషనల్ బ్యూరో :**

ప్రముఖ వ్యాపారవేత్త, టాటా సన్స్ అధినేత రతన్ టాటా కన్నుమూశారు. ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ముంబైలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ట్రీట్ మెంట్ తీసుకుంటూ రతన్ టాటా కన్నుమూశారు. దిగ్గజ వ్యాపారవేత్త, అంతకు మించి గొప్ప మానవతావాది ఇకలేరనే వార్త యావత్ దేశంలో శోకం నింపింది. రతన్ టాటా వయసు 86 ఏళ్లు. 1937 డిసెంబర్ 28 న ముంబైలో నావల్ టాటా - సోనీ టాటా దంపతులకు జన్మించారు. పదేళ్ల వయసులోనే రతన్ టాటా తల్లిదండ్రులు విడిపోయారు. పార్సీ జొరాస్ట్రియన్ కుటుంబంలో ఆయన పుట్టారు. భారత దేశ ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1990 నుండి 2012 వరకు టాటా గ్రూప్ కి చైర్మన్ గా ఉన్నారు. అక్టోబర్ 2016 నుండి ఫిబ్రవరి 2017 వరకు టాటా గ్రూప్ నకు తాత్కాలిక చైర్మన్ గా వ్యవహరించారు. టాటా ఛారిటబుల్ ట్రస్టులకు అధిపతి రతన్ టాటా. దేశ అత్యున్నత పౌర పురస్కారాలు పద్మవిభూషణ్ (2008), పద్మభూషణ్ (2000) లను అందుకున్నారు. వ్యాపారంలో విలువలు పాటించారు. దాతృత్వంలో గుర్తింపు పొందారు.

రూ.10 వేల కోట్ల నుంచి రూ.లక్షల కోట్ల వరకు..

1961లో టాటా గ్రూప్‌లో చేరిన రతన్ టాటా..



అంచెలంచెలుగా ప్రగతి పథంలో పరుగులు పెట్టించారు. అనేక అంకుర సంస్థలను ప్రోత్సహించారు. తన సంపదలో 6065 శాతం దాతృత్వానికే కేటాయించారు. ఆయన భారత పారిశ్రామిక రంగానికి కొత్త దశ, దిశ చూపించారు. దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగ పురోగతిలో కీలకపాత్ర పోషించారు. 'టాటా' సామ్రాజ్యాన్ని ఎల్లలు దాటించిన వ్యాపార దిగ్గజంగా నిలిచారు. రూ.10 వేల కోట్ల సామ్రాజ్యాన్ని రూ.లక్షల కోట్లకు చేర్చిన ఆయన.. టాటా గ్రూప్ నుంచి రిటైర్మెంట్ తర్వాత అనేక సామాజిక సమస్యలపై దృష్టిసారించారు. ఆ జన్మాంతం దేశమే ముందు అనే సిద్ధాంతాన్ని ఆచరించారు.

**కొవిడ్‌పై పోరుకు రూ.1500 కోట్ల విరాళం**

కొవిడ్ సమయంలో దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో టాటా సంస్థ తన విశాల హృదయాన్ని చాటుకుంది. మహమ్మారిపై పోరు కోసం రూ. 1500 కోట్ల భూరి విరాళం ఇస్తున్నట్లు రతన్ టాటా ప్రకటించారు. 'అత్యంత కఠినమైన సవాలు మానవాళి ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభ సమయంలో కావిడ్18పై పోరాటానికి అత్యవసర వనరులను సమకూర్చాల్సి ఉంది. వైరస్ ప్రభావానికి గురైన అన్ని వర్గాలను ఆదుకోవడానికి టాటా ట్రస్టు కట్టుబడి ఉంది. రోగులకు ముందుండి సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ కవచాలు, నానాటికీ పెరుగుతున్న రోగులకు కృత్రిమ శ్వాస అందించి తగిన చికిత్స చేయడానికి అవసరమైన పరికరాలు, పరీక్షల సంఖ్య పెంచడానికి అనువైన టెస్టింగ్ కిట్లు, రోగులకు ఆధునిక సౌకర్యాలు అందించడానికి, సాధారణ ప్రజలు, ఆరోగ్య కార్యకర్తలకు అవసరమైన అవగాహన కల్పించడానికి రూ.500 కోట్లు ఖర్చుపెట్టడానికి సిద్ధంగా ఉన్నాం' అని రతన్ టాటా తన ప్రకటనలో స్పష్టంచేశారు.

**రతన్ టాటా దయగల అసాధారణ వేత్త: ప్రధాని మోడీ**

రతన్ టాటా మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'రతన్ టాటా దూరదృష్టి ఉన్న వ్యాపారవేత్త. దయగల అసాధారణ వ్యక్తి. భారతదేశంలోని ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు స్థిరమైన నాయకత్వాన్ని అందించారు. ఎంతోమందికి ఆయన ఆప్తుడయ్యారు''అని పేర్కొన్నారు. మెరుగైన సమాజం కోసం ఆయన తనవంతు కృషి చేశారని కొనియాడారు.

# దసరాకైనా కేటీఆర్ బుద్ధి మారాలి

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

అసత్య ప్రచారాలతో ప్రజల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నదని, విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ విషయంలో రాహుల్ గాంధీపై సెటైర్ వేస్తే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్‌కు పొన్నం రియాక్ట్ అయ్యారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని ఇద్యోగాలు ఇచ్చిందని కౌంటర్ ఇచ్చారు. బుధవారం గాంధీ భవన్‌లో మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమానికి పొన్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అంతకు ముందు మీడియాతో మాట్లాడిన ఆయన.. పదవి పోయిన అసహనంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసత్య ప్రచారాలతో ప్రజల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలాంటి పరిస్థితుల్లో ఉందో అందరికి తెలుసన్నారు. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టినా బుద్ధి రావడం లేదని, ప్రజలు ఓడించాక ఇంకా పదేళ్ల పాలనపై చర్చ ఎందుకు అంటూ వ్యాఖ్యానించారు.

**డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు..**

ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రభుత్వాన్ని కూల్చేస్తామని, ఈ ప్రభుత్వాన్ని దించేస్తామని శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ దసరా పండుగ సందర్భంగానైనా వారి మనసు మారాలని భగవతుడిని కోరుతున్నాన్నారు. కేంద్రం నుంచి వరద సహాయం సాధించే విషయంలో ప్రతిపక్షం సహకరించాలన్నారు. ప్రతిపక్షాల సలహాలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ప్రభుత్వం 150 మందికి విదేశీ విద్యానిధి ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 500 మందికి విదేశీ విద్యానిధి ఇస్తోందన్నారు. మూసీ విషయంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పొన్నం ఖండించారు. రెండు ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా బీఆర్ఎస్ కు బుద్ధిరాలేదని అందుకే పది నెలలైనా కానీ మా పాలనపై చర్చకు రావాలని జగదీశ్ అంటున్నారని మండిపడ్డారు. జగదీశ్ రెడ్డి మా పది నెలల ప్రభుత్వంపై కాకుండా మీరు పదేళ్లు ఏం చేశారో ఆలోచన చేసుకోవాలన్నారు. మూసీ నిర్వాసితులకు పునరావసం కల్పించాకే ఖాళీ చేస్తున్నామన్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో పాటు వారి పిల్లల చదువులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖ ద్వారా కులగణన చేపట్టబోతున్నామన్నారు.

# బీఆర్ఎస్ ఆనాడు ఏం చేసింది

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

మూసీపై డీపీఆర్ కాకముందే ఆరోపణలు చేయడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ నియామకాల మీద బీఆర్ఎస్ ఇప్పుడు మాట్లాడుతోంది.. ఆనాడు ఏం చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో గుర్తు చేసుకుంటే మంచిదన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మండలి చైర్మన్ లో కుర్చీలో కూర్చున్నామంటే ఏ పదవికి సంబంధం ఉండదన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనపై మాట్లాడే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ఆర్థిక వనరులు ఉన్నా లేకపోయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సక్రమంగా పనిచేస్తుందన్నారు. రుణమాఫీ మాట ప్రకారం పూర్తి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకులు వాడుతున్న భాష సరిగా లేదని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా వాడుకున్నా.. ఇకేమైనా వాడుకున్న.. పద్ధతి ఉండాలన్నారు. ఒక పని ప్రభుత్వం చేస్తుంది అంటే ప్లస్ ఆర్ మైనస్ కౌంట్ చేయవద్దని సూచించారు. మూసీ ప్రక్షాళన కూడా అంతే.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని తెలిపారు. హైడ్రా వల్లే రిజిస్ట్రేషన్‌లు పడిపోయాయని.. ఆదాయం తగ్గిందనడం కరెక్ట్ కాదన్నారు. అధికారులు పర్మనెంట్, రాజకీయ నాయకులు టెంపరరీ అని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల లూప్ హోల్స్ అధికారులకు బాగా తెలసని వ్యాఖ్యానించారు.

# వారి ఉద్యోగాలు ఊడగొడ్తే.. మీకు ఉద్యోగాలొచ్చాయ్

**(మొదటి పేజీ తరువాయి)**

చూస్తోంటే దసరా పండగ మూడు రోజుల ముందే వచ్చినట్లుందని టీచర్ ఉద్యోగాలు పొందిన వారితో అన్నారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు గత పదేళ్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నామన్నారు. ఆ కొరివి దెయ్యాన్ని రెండుసార్లు ముఖ్యమంత్రిని చేసినా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. తెలంగాణ వచ్చిన వెంటనే ఇవ్వాల్సిన డీఎస్సీ నోటిఫికేషన్ మూడేళ్లు ఆలస్యంగా 2017లో ఇచ్చారు. నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్ల తర్వాత 2019 నియామకాలు జరిపారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన 65 రోజుల్లోనే 10,006 ఉపాధ్యాయ నియామక పత్రాలు అందిస్తున్నామని, తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర కీలకమని సూచించారు.

త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ..

రాష్ట్రంలో 34 వేల మంది టీచర్ల బదిలీలతో పాటు 21 వేల మంది టీచర్లకు పదోన్నతులు అందించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మీ సంతోషం చూసి కొంతమంది కండ్లల్లో కారం కొట్టుకుంటున్నారన్నారు. గత పదేళ్లలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చుకున్న కేసీఆర్ .. పేదోళ్ల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వాళ్లు సలహాలు ఇవ్వరు... కానీ మేం చేస్తుంటే కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారన్నారు. అసెంబ్లీకి రావు.. సలహాలు, సూచనలు ఇవ్వవు. మంచి పనులు చేస్తుంటే కాళ్లల్లో కట్టెలు పెట్టి అడ్డుకుంటున్నారు.



తెలంగాణ సమాజం మీద మీకెందుకంత కోపం. ఇకపై తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడుతామని బాధ్యతలేకుండా మాట్లాడుతున్నారు. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నాను. ప్రభుత్వ స్కూళ్లకు పంపడానికి కొందరు నామోషీగా ఫీలవుతున్నారు. పేదోళ్లు తాళిబొట్టు తాకట్టు పెట్టి ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నారు. బడ్జెట్ లో విద్యారంగానికి రూ. 21 వేల కోట్లు కేటాయించాం. ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు సంబంధించి 25 నియోజకవర్గాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత పదేళ్ల కాలంలో యువత గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా పెరిగింది. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతుంది. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలి. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా మంచి మంచి క్రీడాకారులను తయారు చేస్తాం. వచ్చే ఒలింపిక్స్ లో తెలంగాణ నుంచి గోల్డ్ మెడల్ సాధించేలా శిక్షణ ఇస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు.

**ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు సన్నాహాలు..**

తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 60 రోజుల్లో నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. 24గంటల్లో కమిషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై చర్చించిన క్యాబినెట్ సబ్ కమిటీ.. సోమవారం నాలుగోసారి సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు సమావేశమై చర్చించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# కవితను జైల్లో పెట్టినా.. భయపడకుండా పోరాటం చేస్తున్నాం

**(మొదటి పేజీ తరువాయి)**

కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుద్దీన్, పలువురు తెలంగాణ నేతలు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ పూర్తిగా కాలేదని, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క మహిళకూ రూ. 2,500 రాలేదన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట లక్ష కోట్ల రూపాయలను కాజేయాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టే ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు.

**గల్లా పట్టి అడిగే వరకు మోసం చేస్తారు...**

హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని, అక్కడి ఫలితాలు చూశాక అయినా తెలంగాణలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కేసీఆర్ లేని లోటును హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ గుర్తుకు చేసుకుంటున్నారని తెలిపారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతులు, ప్రజలకు అండగా నిలబడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని దుర్మార్గంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమీషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చని ఆరోపించారు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటుందన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు ఇప్పుడు కేసీఆర్ అధికారంలో లేరన్న బాధలో ఉన్నారని, పేదల కోసం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సెక్యులరిజాన్ని కొనసాగిస్తామని, మనిషి మనిషిగా చూస్తూ భవిష్యత్‌లోనూ అదే తరహా రాజకీయం చేస్తామని కేటీఆర్ తెలిపారు.

**తప్పుడు లెక్కలతో తప్పుదోవ...**

నియామకాలపై మరీ ఇంత నీతిమాలిన ప్రచారమా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడానికి కొంచెమైనా సిగ్గుండాలి కదా అని ట్విట్టర్ వేదికగా నిలదీశారు. నియామకాలపై మరీ ఇంత నీతిమాలిన ప్రచారమా.. ప్రజా ధనాన్ని తగలేసి...ఫ్రంట్ పేజీల్లో పచ్చి అబద్ధాలతో ప్రకటనలా. గత ప్రభుత్వ ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడానికి కొంచెమైనా సిగ్గుండాలి కదా.. తెలంగాణ యువతను పిచ్చోళ్లను చేస్తున్నావా... అశోక్ నగర్ చౌరస్తాకు.. ఉస్మానియా క్యాంపస్‌కు పోయి చెప్తవా నీ కొలువుల పండుగ కథలు..? ఏడాదిలో 2 లక్షల కొలువులు గ్యారెంటీ అని.. నిరుద్యోగుల చెవుల్లో పువ్వులు పెట్టింది చాలక.. తప్పుడు లెక్కలతో తప్పుదోవ పట్టించడం దుర్మార్గం.. అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మందకృష్ణ మాదిగ అరెస్ట్

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ పార్శీగుట్టలో ఉన్న ఎమ్మార్పీఎస్ భవనం నుంచి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు.. శ్రేణులతో కలిసి బయలుదేరిన మందకృష్ణ మాదిగను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు అడ్డుకున్నా సరే తమ ర్యాలీని కొనసాగిస్తామంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఎమ్మార్పీఎస్ నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. మందకృష్ణ మాదిగను గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. ఎమ్మార్పీఎస్ శ్రేణులను నగరంలోనే వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

**అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం..**

రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ప్రభుత్వ ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్న నేపథ్యంలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయ నియామక పత్రాలు ఇవ్వడంపై మందకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ ఎలా చేపడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను , కార్యకర్తలు ఉద్యమకారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని మందకృష్ణ ప్రశ్నించారు. ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాదిగలకు అన్యాయం చేయడానికే రేవంత్ రెడ్డి సర్కార్.. మాలలతో కుమ్మక్కై మాదిగలను మోసం చేస్తున్నారని మందకృష్ణ మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు.. మాదిగల వాటా తేలే వరకు ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరపొద్దని మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు.

# హైడ్రా బాధితులకు మన జీతాలిద్దాం

**ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని మొత్తం 119 మంది ఎమ్మెల్యేలు, 19 మంది ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ జీతాలను నష్టపోయిన హైడ్రా బాధితులకు ఇద్దామని సీఎం రేవంత్ రెడ్డికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సూచించారు. తన పది నెలల ఎమ్మెల్యే జీతం రూ. 20 లక్షలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అందుకు మిగతా వారంతా రెడీగా ఉన్నారా? సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడిన అంశంపై ఆయన స్పందించారు. డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్షల కోట్ల విలువ చేసే అనేక స్థలాలు కబ్జాలకు గురయ్యాయని ఆయన ఆరోపించారు. వీటిలో కంపెనీలు ఏర్పాటు చేసుకునేందుకు విదేశీయులకు ఈ ప్రభుత్వం అనుమతులు సైతం ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల్లో అనేక చోట్ల బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న వాటికి ఈ రేవంత్ సర్కార్ ఈసీ సర్టిఫికెట్స్ కూడా జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇదంతా చేస్తుందని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేవలం మధ్య తరగతి ప్రజలనే లక్ష్యంగా చేసుకుని మాట్లాడారన్నారు. భూములు ఆక్రమించిన బడా బాబులతోపాటు 30 కంపెనీల వివరాలు త్వరలో తాను బయట పెడతానని ఆయన స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో వేలాది మంది ఇళ్లు నిర్మించుకునేందుకు వివిధ బ్యాంకులు లోన్లు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ఇవన్నీ అవాస్తవమని మీరు నిరూపిస్తే నేను సూసైడ్ చేసుకొని చనిపోతానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి.. రేవంత్ సర్కార్‌కు సవాల్ విసిరారు.

# కాంగ్రెస్ కుట్రలన్నీ విఫలం



**ప్రజా స్వరం, నేషనల్ బ్యూరో :**

సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ.. హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హర్యానా ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హర్యానా ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీలు), దళితులు బీజేపీకి అండగా నిలిచారని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హర్యానా రైతులకు తెలుసు కాబట్టే వారు బీజేపీని గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు' అని మోడీ అన్నారు.

**కాంగ్రెస్ మండిపాటు..**

ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఖండించారు. ప్రధాని రాజకీయ ప్రసంగాల కోసం ప్రభుత్వ కార్యక్రమాలను ఎందుకు ఉపయోగించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇలాంటి ప్రసంగాల కోసం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయకుండా బీజేపీ సొంత సొమ్ముతో వేదికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.





# తెలంగాణ పండుగల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం

## మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్, అక్టోబర్ 09 (ప్రజా స్వరం) :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిరా, డీసీవో కరుణ, అడిషనల్ డీఆర్డీవో సరస్వతి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి అధికారి డాక్టర్ శ్రీరామ్, డీఆర్డీవో శాఖ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్ సంబంధిత అధికారులు జిల్లాలోని తెలంగాణ మహిళా సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. సుమారు గంట పాటు మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. ఈ సందర్భంగా పలు శాఖల మహిళా ఉద్యోగులు తయారు చేసిన బతుకమ్మలతో జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణం సందడి వాతావరణం నెలకొంది. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఇందిరా మహిళా శక్తి మెదక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ వంటకాల ప్రదర్శన, జిల్లా పర్యాటక శాఖ పర్యాటక ప్రదేశాలు స్టాల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బతకమ్మ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ఎంతో ఘనమైన పండుగని ఈ పండుగ మన తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తుందన్నారు. తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు అందరూ కలిసి తీరొక్క పూలను బతుకమ్మలుగా పేర్చి ఆడుకునే గొప్ప పండుగ అని అన్నారు. బతుకమ్మ పండుగ మన సంస్కృతికి అద్దం పడుతున్నదని, బతుకమ్మ పండుగను అందరు సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఇలాంటి సంస్కృతి మన తెలంగాణలోని ఉందని తెలిపారు. మన పండుగ, సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అని తెలిపారు. ఆడపడుచులు బతుకమ్మ పండుగ ను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ డీఆర్డీవో బతుకమ్మకు మొదటి బహుమతి, మెప్మా డిపార్ట్‌మెంటుకు ద్వితీయ బహుమతి, మహిళా శిశు సంక్షేమ శాఖకు తృతీయ బహుమతులు అందజేశారు.







# సరస్వతి దేవీ అవతారంలో దుర్గామాత

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 9 (ప్రజాస్వరం) :** చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామంలోని దుర్గాదేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడవ రోజైన బుధవారం సప్తమి పురస్కరించుకొని,దుర్గామాతను చదువుల వరదాయిని (సరస్వతీ దేవి)గా, తెలుపు రంగు చీర, వీణతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకులు శివ ప్రసాద పంతులు తదితరులు వేకువ జామునే మూలవిరాట్, ప్రతిష్టించి అమ్మవారి ఉత్సవ విగ్రహం, ఆలయంలో దుర్గ మాత ఉత్సవ విగ్రహాకు అభిషేకం, అర్చనలు నిర్వహించి తెలుపు రంగు వస్త్రం, వివిధ రకాల పుష్పాలు, వీణతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించారు. భక్తులే పెద్ద ఎత్తున పాల్గొని సరస్వతి మాత అవతారంలో దర్శనం ఇచ్చిన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఏడుపాయల అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**పాపన్నపేట, అక్టోబర్ 09 (ప్రజా సర్వం) :** తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ ఏడుపాయల వనదుర్గాభవాని మాత అమ్మవారి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తానని, ప్రణాళికలు సైతం రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపించామని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు వెల్లడించారు. దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏడుపాయల్లో శ్రీ సరస్వతి దేవి అలంకారంలో ఉన్న వనదుర్గాదేవి అమ్మవారిని ఎమ్మెల్యే రోహిత్ ఆయన సతీమణి శివానిలు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపం లో ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గం పాడి పంటలతో సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండేలా దుర్గాదేవి అమ్మవారు అనుగ్రహించి ఆశీస్సులు ఇవ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. మంజీర సింగూర్ ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో ఈ ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేలా తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే విధంగా తమకు దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు, అనుగ్రహం నిండుగా అందించాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే రోహిత్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత అద్భుతమైన ఏడుపాయల పుణ్యక్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు తన ఛాయా శక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే రోహిత్ వివరించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవింద్ నాయక్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ అప్ప, నిట్టూరి నిటలాక్షప్ప, ఆకుల శ్రీనివాస్, జంగం సతీష్, ఎండి గౌస్, భరత్ గౌడ్, అప్సర్, సిరాజ్, మురళి, ముశెట్టి కిష్టయ్య, సత్య గౌడ్, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**దౌల్తాబాద్, అక్టోబర్ 9 (ప్రజా స్వరం) :** అనారోగ్యంతో మృతి చెందిన హమాలీ కార్మికుడి కుటుంబానికి తోటి హమాలీ కార్మికులు చేయూతనందించారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో హమాలి కార్మికుడు కొల్గూరు రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వడ్డేపల్లి హామాలి సంఘం కార్మికులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పదివేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాములు నిత్యం కష్టపడి హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడన్నారు. రాములు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు జనముల శ్యామనాథ్, నుచ్చు నర్సయ్య, మన్నె మురళీ, కాస కుమార్, చాకలి సత్తయ్య, తప్పని సుధాకర్, చాకలి యాదయ్య, చాకలి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరిలో తెగుళ్ల వ్యాప్తిపై అప్రమత్తత అవసరం

**దౌల్తాబాద్, అక్టోబర్9 (ప్రజాస్వరం) :** వరిలో తెగుళ్ల వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. బుధవారం రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ గ్రామ పరిధిలోని వరి పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్తి, వరి పంటల్లో వచ్చే చీడ పీడల, తెగుళ్ల నివారణ కోసం రైతులకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించటం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, కంపునల్లి, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున రైతులు క్లోర్ ఫైరిఫాస్ 20 శాతం ఈసీ 400 మీ.లీ తోపాటు ప్రోపికొనజోల్ 25శాతం ఈసీ 200 మీ.లీ ఎకరానికి కలిపి పిచికారి చేయడం ద్వారా నివారించవచ్చని తెలిపారు.









వెన్న ముద్దల బతుకమ్మ సందర్భంగా ఆత్మకూరు లో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో గౌరీ రూపంలో ఉన్న బతుకమ్మను ఎత్తుకున్న కొండాపురం సంతోష



# దుర్గాదేవిని దర్శించుకున్న ఎస్సై

**భీమదేవరపల్లి ప్రతినిధి ప్రజాస్వరం :**

శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ముల్కనూర్ చింతల్ బస్టాండ్ వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవిని బుధవారం ఎస్సై సాయిబాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మాడుగుల అశోక్, ప్రధాన కార్యదర్శి మాడుగుల నరేందర్, కోశాధికారి బొల్లంపల్లి రాజమౌళి, మాడుగుల ఈశ్వరయ్య, ఎల్తూరి ప్రభాకర్, మాడుగుల తిరుపతి, ఎల్తూరి ప్రేమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ టాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా

# కోమిరే శ్రీనివాస్ ఎన్నిక...

**శ్రీనివాస్ ను అభినందించిన సబ్బని రమేష్..**

**చిగురుమామిడి, ప్రజాస్వరం :**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో ట్రాక్టర్ యూనియన్ ఎన్నికలు గౌరవఅధ్యక్షులు సుధాకర్ రెడ్డి,రెడ్డి సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.టాక్టర్స్ యూనియన్ అధ్యక్షుడిగా కోమిరే శ్రీనివాస్,ఉపాధ్యక్షునిగా ఎస్ కే కశిం,క్యాషియర్ గా గాజుల తిరుపతిలను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.అధ్యక్షుడిగా శ్రీనివాస్ ఎంపిక కావడం పట్ల సబ్బాని రమేష్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు. ట్రాక్టర్స్ అసోసియేషన్ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని శ్రీనివాస్ చెప్పారు.ఈ కార్యక్రమంలో ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# వాకర్స్ కి టీషర్ట్ లు పంపిణీ చేసిన ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి



**వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పిలుపు..**

**చిగురుమామిడి, ప్రజాస్వరం :**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబ్ పేట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి వాకర్స్ కి టీషర్ట్స్ లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉదయం వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామం చేయాలని కోరారు. ప్రస్తుతానికైతే పది మందికి టీ షర్టు పంపిణీ చేశానని,ఇంకా ముందు ముందు వ్యాయామం చేయడానికి ఎంతమంది వచ్చినా వారికి టీ షర్టు పంపిణీ చేస్తానని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాగూర్ నరేందర్ సింగ్,మాజీ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్,సోషల్ మీడియా మండల కన్వీనర్ బోయిని వేణుగోపాల్,ఠాగూర్ దిలీప్ సింగ్,నార్లపురం మల్లేశం, గుళ్ళ రాజు,తదితరులు పాల్గొన్నారు.

# గాంధీలో బతుకమ్మ వేడుకలు, దసరా పూజలు

**బన్సీలాల్ పేట్ ప్రతినిధి, ప్రజాస్వరం:**

గాంధీ ఆసుపత్రి లో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే విజయదశమి దుర్గామాత పూజలు కూడ నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్ ఎదుట మహిళా సిబ్బంది రంగు, రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పెట్టి, సాంప్రదాయ దుస్తులు ధరించి, పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. గాంధీ ఫార్మసీ డిపార్ట్ మెంట్ లో విజయదశమి దుర్గామాత పూజలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. పూజల్లో గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఆర్ఎంఓ వన్ డాక్టర్ శేషాద్రి, డా.రజనీ,ఫార్మసీ ఇంచార్జీ సుధాకర్ రెడ్డి, టీఎన్జీవో ప్రెసిడెంట్ ప్రభాకర్ , ప్రతినిధులు శాంతారాణి, స్వప్న, శ్రవణ్, విశ్వనాథ్ ,హెల్త్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంఓలు, సీఎంఓలు, మినిస్టిరీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.





**బెజ్జంకి మండల కేంద్రం లోని ఎస్సీ కాలనీలో బుధవారం దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనం ఇచ్చారు . మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో నిర్వహకులు , భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.**







# నేడే సద్దుల బతుకమ్మ

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా జరుపుకునే బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు కనుల పండువగా జరుగుతోంది. చిన్నా, పెద్దా అంతా రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సందడి చేస్తారు. పూల సింగిడి నేలకు దిగిందా అన్నట్టుగా చౌరస్తాలన్నీ బతుకమ్మలతో, ఆడపడుచులతోనూ మురిసిపోయాయి. మహిళామణుల పండుగగా పిలుచుకోనే బతుకమ్మలో సందడిగా ఆడిపాడుతున్నారు. తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళలు ఆడి పాడుతున్నారు. నేడు ట్యాంక్ బండ్‌పై 10 వేల మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు జరుగనున్నాయి. సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారు. బతుకమ్మలతో పాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని, ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారు.

**సిటీలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు..**

బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్ నుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ట్యాంక్ బండ్ చిల్డ్రన్ పార్క్‌లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులను సూచించారు. సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా నేడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో అమరవీరుల స్మారకస్థూపం నుంచి అప్పర్ ట్యాంక్ బండ్‌లోని బతుకమ్మ ఘాట్ (రోటరీ చిల్డ్రన్స్ పార్క్) వరకూ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని వెల్లడించారు. గురువారం రోజు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకూ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ఈ ప్రాంతాల గుండా వెళ్లే ప్రయాణికులు ఇతర మార్గాలను చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో..





**తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల్లో బుధవారం మహిళలు, యవతులు బతుకమ్మ వేడుకలు చేసుకున్నారు. అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ ఆటపాటలతో సందడిగా గడిపారు.**




కరీంనగర్‌లో బతుకమ్మను తీసుకొస్తున్న దృశ్యం..





కూకట్‌పల్లిలో బతుకమ్మ సంబరాలు..



## ఎస్ఎస్ఎంబీ 29 షూటింగ్
# జనవరి నుంచి



మహేశ్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో సినిమా రాబోతున్నదంటే దానికి ఏ రేంజ్ లో హైప్ క్రియేట్ అయ్యిందే ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలతో రాజమౌళి ఇమేజ్ ప్రపంచస్థాయికి వెళ్లిపోయింది. ఇక మహేశ్ బాబుకు ఉన్న మార్కెట్, ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఈ ఇద్దరి కాంబోలో తెరకెక్కబోతున్న మూవీకి సంబంధించి ఏ అప్ డేట్ కూడా ఇప్పటివరకు బయటకు రాలేదు.. కథ ఎలా ఉండబోతున్నది? ఈ సారి చారిత్రక నేపథ్యమా? ఇతిహాసమా? జానపదమా? సాంఘిక చిత్రమా? ఏదీ తెలియడం లేదు. కానీ రాజమౌళి ఏం తీసినా అద్భుతంగానే తీస్తాడు కాబట్టి.. అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఎస్ఎస్ఎంబీ 29 పై ఇప్పుడో క్రేజీ అప్ డేట్ బయటకు వచ్చింది. చిత్ర కథా రచయిత, డైరక్టర్ రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ తాజాగా ఈ మూవీ షూటింగ్ గురించి ప్రస్తావించారు. 'మాస్టర్ క్లాస్ బై మిస్టర్ విజయేంద్ర ప్రసాద్' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. జనవరి నుంచి మహేశ్ రాజమౌళి మూవీ షూట్ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కథ రాయడానికి దాదాపు రెండేళ్లు టైమ్ పట్టిందన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# కాబోయే వాడికి ఈ క్వాలిటీస్ ఉండాలి

త్రిప్తి దిమ్రి ఒక్క మూవీతో కుర్రకారు మనసు దోచేసింది. యానిమల్ మూవీలో త్రిప్తి రొమాంటిక్ నటనకు యూత్ మొత్తం ఫిదా అయిపోయింది. బహుశా ఒక్క సినిమాతోనే ఈ స్థాయిలో ఇమేజ్ సాధించిన నటి త్రిప్తియే కావొచ్చు. ఇక దేశవ్యాప్తంగా ఫుల్ క్రేజ్ సాధించడంతో ఇప్పుడు ఆమె డేట్స్ కోసం నిర్మాతలు పడిగాపులు గాస్తున్నారు. డైరెక్టర్లు ప్రత్యేకంగా త్రిప్తిని దృష్టిలో ఉంచుకొని కథలు రెడీ చేస్తున్నారు. ఇటీవల విడుదలైన బ్యాడ్ న్యూజ్ కూడా చెప్పుకోదగ్గ విజయం సాధించింది. ఇక త్రిప్తీ చాలా కాలంగా సామ్ మర్చంట్‌తో రిలేషన్ లో ఉందన్న కథనాలొచ్చాయి. కానీ దానిని ఈ భామ కన్ఫామ్ చేయలేదు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన లవ్ లైఫ్ గురించి మాట్లాడింది. తనకు కాబోయేవాడు ఎలా ఉండాలో కూడా ఈ సందర్భంగా ప్రస్థావించింది. ఇంతకీ ట్రిప్తీకి కాబోయేవాడు ఎలా ఉండాలి? అంటే... 1993 రొమ్‌కామ్ కభీ హాన్ కభీ నాలో షారుఖ్ ఖాన్ తన ప్రియురాలిపై ఎలాంటి ప్రేమను కనబరుస్తారో అలాంటి స్వచ్ఛమైన ప్రేమను అనుభవించాలనుకుంటున్నట్లు పేర్కొంది. 'షారుఖ్ ఖాన్ సుచిత్రా కృష్ణమూర్తిల కభీ హాన్ కభీ నా తనకు ఇష్టమైన రొమాంటిక్ సినిమా అని పేర్కొంది. రొమాంటిక్ కామెడీలో కింగ్ ఆఫ్ రొమాన్స్ పాత్ర గురించి మాట్లాడుతూ..ఆ సినిమాలో ఉన్న అమాయకత్వం నిజమైన ప్రేమకు చిహ్నం అని పేర్కొంది.



# యాక్షన్ తో థ్రిల్ చేయబోతున్న సంయుక్త

సంయుక్త మీనన్ లక్కీ గర్ల్ గా తెలుగు ఇండస్ట్రీని ఏలుతోంది. ఇప్పటివరకు ఈ నటికి తెలుగులో ఒక్క ఫెయిల్యూర్ కూడా లేదు. అందుకే నిర్మాతలు, హీరోలు ఈమె వెంట పడుతున్నారు. భీమ్లా నాయక్, బింబిసార, సార్, విరూపాక్ష ఇలా తన ఖాతాలో అన్నీ హిట్లే. అయితే ఇప్పుడు ఓ థ్రిల్లర్ మూవీలో నటించబోతున్నది సంయుక్త. హాస్య మూవీస్ బ్యానర్‌పై రానున్న ఓ లేడీ ఓరియంటెడ్ సినిమాలో అవకాశాన్ని అందుకున్నారు సంయుక్త. బుధవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. దీనికి నిర్మాతలు దిల్ రాజు, కోన వెంకట్‌తో పాటు రానా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



# ఆహాలోకి గొర్రె పురాణం

నటుడు సుహాస్ చేసే చిత్రాలన్నీ విభిన్నమే. ఏ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చిన సుహాస్ తెలుగు ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసుకున్నారు. వైవిధ్యభరితమైన చిత్రాల్లో నటిస్తూ అలరిస్తున్నాడు. ఇటీవల ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గొర్రె పురాణం' పెద్దగా కమర్షియల్ సక్సెస్ అవ్వలేదు కానీ.. విమర్శకుల ప్రశంసలు పొందింది. ఓ గ్రామంలోని ఇరువర్గాల మధ్య ఒక గొర్రె వల్ల గొడవలు మొదలవడం.. దానిపై కేసు పెట్టడం వంటి అంశాలతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. గత నెలలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ రిలీజ్‌కు రంగం సిద్ధమైంది. ఆహా వేదికగా అక్టోబర్ 10 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓటీటీ సంస్థ పోస్ట్ పెట్టింది.

# పాపం పూజా.. రెమ్యూనరేషన్ తగ్గించినా నో ఛాన్సెస్



బుట్టబొమ్మగా కుర్రకారు మతులు పోగొట్టిన పూజా హెగ్డే ఇప్పుడు డౌన్ అయిపోయింది. ఒకప్పుడు ఆమె డేట్స్ కోసం ప్రముఖ నిర్మాణ సంస్థలు పోటీ పడేవి. యంగ్ హీరోస్ అందరూ ఆమెను తమకు జోడీగా పెట్టుకోవాలని తెగ ఆశపడేవారు. కానీ ఇండస్ట్రీ అంటేనే సక్సెస్ వెంట పరుగులు తీస్తుంది. అందుకే ఒక్క డిజాస్టర్ తగలగానే పూజా గ్రాఫ్ అమాంతం పడిపోయింది. ఇప్పుడు చిన్న హీరోల సరసన కూడా పూజకు చాన్స్ లు రావడం లేదు. రెమ్యూనరేషన్ తగ్గించినా .. అందాల ఆరబోతకు సిద్ధమైన లాభం ఉండటం లేదు. బాగా స్టార్ డమ్ ఉన్నప్పుడు పూజా పెద్ద మొత్తంలో రెమ్యూనరేషన్ డిమాండ్ చేసేదట. ఆమె స్టాఫ్ కు కూడా పెద్ద మొత్తంలో పే కోరడం, స్టార్ హోటల్ లో ఉండటం వంటి వివిధ విషయాల్లో నిర్మాతలను ఇబ్బందులకు గురి చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో ఇప్పుడు పూజాను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ విజయ్ తో సినిమా చేసేందుకు పూజా తక్కువ రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది ఆమె సాధారణంగా తీసుకునే పారితోషకం కంటే దాదాపు సగం తగ్గించేసిందట. ఈ నేపథ్యంలో పూజా మళ్ళీ టాలీవుడ్ లో తిరిగి అవకాశాలు పొందాలని చూస్తున్నప్పటికీ, ఆమెకు పెద్దగా ప్రాజెక్టులు రావడం లేదని తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999